క్లుప్తంగా


పద్మశాలీ మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 9న నిర్వహించే పద్మశాలీ మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర నాయకులు స్వామి, మురళి కోరారు. పెద్దపల్లిలో శుక్రవారం వారు మహాసభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు రామచంద్రం, ఆడెపు సుధాకర్, రాజేశ్, గ్యాజంగి లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, దాసరి ఉష, వేముల రాజమౌళి, రాయమల్లు, కొండి సతీశ్, రమేశ్, దేవసాని లక్ష్మీపతి, శంకరయ్య ఉన్నారు.

ఘనంగా టైలర్స్ డే



కేక్ కట్ చేస్తున్న రీజనల్ చైర్మన్ సురేందర్

ధర్మారం: మండల కేంద్రంలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ రీజనల్ చైర్మన్ తాళ్లపల్లి సురేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం టైలర్ వృత్తిదారులను సన్మానించారు. క్లబ్ జిల్లా జోన్ చైర్మన్ ఎలగందుల అశోక్, క్లబ్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మహేందర్, కోశాధికారి తోడేటి మురళీగౌడ్, ఉపాధ్యక్షుడు బైరి చంద్రమౌళి, బొల్లం మల్లేశం వేముండ్ల సుభాష్, కోశాధికారి కందుల సతీశ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మేరుభవన్‌లో టైలర్స్ డే



వేడుకల్లో సంఘం సభ్యులు

గోదావరిఖనిటౌన్: స్థానిక మేరు భవన్‌లో మేరు సంఘం అధ్యక్షుడు కీర్తి నాగరాజు ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, మేరు సంఘం నాయకులు గట్ల రమేశ్, సర్వేష్ పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని శివాజీనగర్‌లో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తికాగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో కాంక్రీట్ పనులు కొనసాగుతున్నాయి. శుక్రవారం కొనసాగుతున్న పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్ పరిశీలించారు.

పౌరహక్కులపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ఉప్పర్లకేసారం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, జూనియర్ అసిస్టెంట్ యశ్వంత్, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు బూడిద సమ్మయ్య, సురేశ్, రమేశ్, గోదావరిఖని టూటౌన్ ఎస్సై హైమదుల్లా, మల్లేశ్, ఆర్‌ఏ రాజేశం, రాజు పాల్గొన్నారు.

ర్యాకల్‌దేవుపల్లిలో సివిల్ రైట్స్‌డే

ఎలిగేడు: మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో శుక్రవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా కులవివక్ష పాటిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ వెల్ఫేర్ అధికారి అంజయ్య, ఎంఈవో నరేంద్రచారి, ఆర్‌ఐ జయలక్ష్మి, కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కల మద్దికుంట గ్రామానికి చెందిన బొంకూరి శ్రీనివాస్(43) చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, గత నెల 20న ఎక్కువ మొత్తంలో ట్యాబ్లెట్లు మింగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘మల్చింగ్’ సాగుతో ఆర్థికాభివృద్ధి

- పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ
- ఎకరాకు రూ.6400 సబ్సిడీ
- ఆసక్తి చూపుతున్న రైతన్నలు
- జిల్లాలో 50ఎకరాల్లో కూరగాయల సాగు



సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో మల్చింగ్ విధానంలో సాగు చేసిన బీర తోట

ఎలిగేడు: ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పూలతోటలను మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న రైతులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. మల్చింగ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇస్తోంది. ఎకరాకు రూ.6,400 సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు ఉద్యాన పంటలను మల్చింగ్ విధానంలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సాగు విధానం ఇలా..

పంట సాగు చేసిన తర్వాత మొక్కల చుట్టూ వేరు భాగాన్ని కప్పి ఉంచడాన్ని మల్చింగ్ విధానం అంటారు. బిందు సేద్యం, మల్చింగ్ ద్వారా సాగు చేస్తూ రైతులు ఆశించిన దిగుబడులు సాధిస్తున్నారు. ఈ పద్ధతిలో జిల్లాలో రైతులు కూరగాయలు, పూలు, పండ్లతోటలు సాగుచేస్తున్నారు. జిల్లాలో 366 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తుండగా అందులో 50ఎకరాల్లో రైతులు మల్చింగ్ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో మొక్కలకు ఇరువైపులా 5 నుంచి 10సెంటీమీటర్ల లోతులో గాడలు చేయాలి. మల్చింగ్ షీట్ చివరలు గాడలో ఉండేలా చేసి, చివరలు మట్టితో కప్పాలి.

సాగుతో లాభాలు ఇవి..

మల్చింగ్ విధానంలో పంటల సాగు ద్వారా మొక్క చుట్టూ తేమ ఆవిరి కాదు. కలుపు మొక్కలు రాకుండా చేస్తుంది. 30 నుంచి 40శాతం సాగునీరు ఆదా అవుతుంది. సూర్యరశ్మి చేరకపోవడంతో కలుపు మొక్కలు నివారించబడతాయి. మల్చింగ్ సాగులో ఉన్న పంట పొలంలో వర్షం కురిసినప్పుడు మల్చింగ్ షీట్ కారణంగా నేరుగా భూమిపై పడకపోవడంతో మట్టికోతకు గురికాకుండా నివారిస్తుంది. పంటల భూసారం పరిరక్షించబడుతుంది. మల్చింగ్ పద్ధతి ద్వారా నేలలో ఉష్ణోగ్రత నియంత్రించడంతో పాటు భూమిలోపల ఉన్న క్రిమికీటకాలు, తెగుళ్లను నియంత్రిస్తుంది. నేల నిర్మాణం వృద్ధి చెంది మొక్కలకు పోషకాలు అందడంతో దిగుబడులు పెరుగుతాయని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గుతుంది. దీంతో రైతులకు పెట్టుబడులు ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి ఆర్థికాభివృద్ధి సాధిస్తారు.

డ్రిప్‌పై సబ్సిడీ..

కూరగాయల సాగులో డ్రిప్‌కు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీ ఉండగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని, బీసీ, ఓసీ రైతులకు 90శాతం సబ్సిడీ, 5 ఎకరాలకు పైబడిన రైతులకు 80శాతం సబ్సిడీపై డ్రిప్‌లు అందించనున్నారు.

కలుపు మొక్కలు రావు



మల్చింగ్ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తున్న. ఈ విధానంలో సాగు చేయడం ద్వారా కలుపు మొక్కలు రావు. మల్చింగ్ పద్ధతిలో ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు పెట్టుబడి అవుతుండగా సాధారణ సాగుకు రూ.20వేలు వరకు ఖర్చు అవుతుంది.

– బద్దం తిరుపతిరెడ్డి, రైతు, లాలపల్లి, ఎలిగేడు

అధికారులను సంప్రదించాలి



మల్చింగ్ విధానంలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సబ్సిడీ ఇస్తోంది. ఎకరాకు రూ.6,400 అందజేస్తున్నాం. కూరగాయలు బొప్పాయి, తదితర పంటలకు మాత్రమే సబ్సిడీ ఉంది. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి.

– మహేశ్, ఉద్యానశాఖ అధికారి, పెద్దపల్లి డివిజన్

పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం



పెద్దపల్లిరూరల్: నిట్టూరు హైస్కూల్‌లో..



మంథని: ప్రయోగాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్



జ్యోతినగర్: నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఓదెల: పొత్కపల్లి పాఠశాలలో సైన్సు దినోత్సవం



ఫెర్టిలైజర్‌సిటీ: నివాళి అర్పిస్తున్న టీచర్లు



రామగుండం ఆదర్శ విద్యార్థులు



ముత్తారం కేజీబీవీలో..



కాల్వశ్రీరాంపూర్: ఊశన్నపల్లె పాఠశాలలో..

పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్/జూలపల్లి/ముత్తారం/కాల్వశ్రీరాంపూర్/మంథని/రామగుండం/ఓదెల: డాక్టర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలను మండల వైద్యాధికారులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు రంగవల్లి చార్టులు, మోడల్స్, ప్రయోగశాల, ప్రదర్శన, క్విజ్ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సంక్షిప్త వార్తలు

• గుండెపోటుతో రైతు మృతి

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంట గ్రామానికి చెందిన రైతు సాగంటి శాంతికుమార్ (42) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందాడు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లగా ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలి పోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మాజీ ఎంపీపీ విసారపు వెంకటేశం, మాజీ సర్పంచ్ సంతోష్‌రావు, మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుంట రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు తోట ముత్తులింగం పరామర్శించారు.

• సెల్‌ఫోన్ అందజేత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన మహంకాళి శంకర్ తన ఫోన్ పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఆచూకీ తెలుసుకుని ఫోన్‌ను రికవరీ చేశారు. శుక్రవారం బాధితుడు శంకర్‌కు ఏఎస్‌ఐ రాంచంద్రం ఫోన్ అందజేశారు.

• మేజిక్ రాజాకు పీసీ సర్కార్ మెమోరియల్ అవార్డు

గోదావరిఖనిటౌన్: ప్రముఖ ఇంద్రజాలికుడు ఖని వాస్తవ్యుడు మేజిక్ రాజాను గురువారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పీసీ సర్కార్ మెమోరియల్ అవార్డుతో సత్కరించారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికులు పీసీ సర్కార్(సీనియర్) జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సహకారంతో ఆర్కే వండర్ వరల్డ్, తెలంగాణ మేజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ మెజీషియన్ డే వేడుకలు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద, అంతర్జాతీయ ఇంద్రజాలికులు బీవీ పట్టాభిరాం చేతుల మీదుగా మేజిక్ రాజా అవార్డు అందుకున్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్: పరిశ్రమల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ డిమాండ్ చేశారు. రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ మార్చి 1వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. యూనియన్ నాయకులు రాఘవరెడ్డి, రాజ్‌కుమార్, నారాయణ, సంపత్, వెంకన్న, శ్రీనివాస్, పరమేశ్, భూమయ్య, భాస్కర్, శ్రీనివాస్, మల్లయ్య, రాజేశం, పోచయ్య పాల్గొన్నారు.

ఎల్లమ్మగుడి ప్రహరీ కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ గుడి ప్రహరీ కూల్చివేతపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గౌడకులస్తులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రావణ్‌కుమారుకు ఫిర్యాదు చేశారు. గౌడ సంఘం అధ్యక్షులు గడ్డం అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం సర్వే నెంబర్ 762లో 1.34 ఎకరాల భూమి రేణుక ఎల్లమ్మ గుడికి సంబంధించినది. కాగా ఈ భూమిలో నుంచి 7గుంటల భూమి తన తండ్రికి చెందినదని చంద్రయ్య తన భార్య కలిసి గౌడ సంఘ సభ్యులతో గొడవకు దిగారు. కగా 8నెలల క్రితం అధికారులతో సర్వే చేయించగా గుడికి సంబంధించినదే అని అధికారులు తెలపడంతో ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి సమయంలో చంద్రయ్య జేసీబీతో ప్రహరీ కూల్చివేశారన్నారు. దీంతో దాదాపు 80మంది గౌడసంఘం సభ్యులందరూ కలిసి ఎస్సైకి ఫిర్యాదు చేశారు. ప్రహరీ కూల్చిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మేకల సతీశ్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లికి చెందిన మేకల సతీశ్‌ను ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు జనక్ ప్రసాద్ ప్రకటించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి తనవంతుగా సహకారం అందిస్తానని సతీశ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులు శ్యాం, జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి దాస్, తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ విద్యాలయంలో వార్షిక వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ధర్మారం: మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో శుక్రవారం వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. ఇంటర్, పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

రక్షణతో విధులు నిర్వహించాలి



బయలుదేరి వెళ్తున్న సింగరేణి ఉద్యోగులు

గోదావరిఖని: శ్రీశైలం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఉద్యోగులు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు చేపట్టాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సూచించారు. ఆర్జీ–1 ఏరియా నుంచి శుక్రవారం బయలుదేరి వెళ్లిన 30మంది కార్మికులను ఆయన అభినందించారు. సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాం ఆదేశాల మేరకు రెస్క్యూ టీం, సింగరేణి కార్మికులతో కూడిన బృందాలను పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏరియాలోని జీడీకే–1, 3, జీడీకే–2, 2ఏ గనులకు చెందిన కార్మికులను ఎంపిక చేశామన్నారు. సహాయక చర్యల్లో పాల్గొనే ఉద్యోగులు రక్షణతో విధులు నిర్వహించాలన్నారు. రెస్క్యూ అధికారులు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, సంక్షేమ అధికారులు గణేశ్, ఇక్బాల్ షరీఫ్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: స్థానిక జీఎం కార్యాలయంలో జూనియర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన యశ్వంత్‌రావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శుక్రవారం ఆయనను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం మలిజీవితం ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, ఏరియా రక్షణ అధికారి ఎస్.సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ ఎస్.అనిల్‌కుమార్, డీజీఎం సివిల్ ధనుంజయ, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, డీజీఎం ఫైనాన్స్ వెంకటరామచంద్ర, సీనియర్ ఎస్టేట్స్ సునీత, పర్చేస్ ఎస్‌ఈ పండరీనాథ్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, ఎంవీటీసీ మేనేజర్ మురళీకృష్ణ, ఫారెస్ట్ అధికారి నవీన్‌కుమార్, డీవైపీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామ ప్రజల మౌలిక వసతుల కల్పనకు సంస్థ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆర్జీ–2 ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్ అన్నారు. ఆర్జీ–2 సింగరేణి వారి ఆధ్వర్యంలో శుక్రవారం సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం చందనాపూర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా సింగరేణి యాజమాన్యం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైద్యులు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, డీవైపీఎం వేణుగోపాల్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగికి అభినందనలు



అభినందిస్తున్న ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్

గోదావరిఖని: కోలిండియా అథ్లెటిక్స్ సైక్లింగ్ పోటీల్లో సత్తాచాటిన జీడీకే–5 ఓసీపీ ఉద్యోగి వెంకట తిరుపతిరెడ్డిని ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ప్రాజెక్టు ఆఫీస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సన్మానించి అభినందించారు. మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ అధికారి పానుగోటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారంలోని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు రాము శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్పొరేట్ ఆఫీస్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడతానన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎల్కలపల్లి మాజీ సర్పంచ్ చిట్టబోయిన రాజ్‌కుమార్, సతీశ్, కన్నూరి శంకర్, దెబ్బెట మల్లేశ్, బండ రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి



అభినందనలు తెలుపుతున్న సంఘం సభ్యులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ పట్టణ శ్రీరామాంజనేయ నాయీబ్రాహ్మణ సేవాసంఘం బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన చెన్నా రాములు అన్నారు. బుగ్గ రామస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేయడంతో పాటు సభ్యుల సమస్యలు పరిష్కరించడంలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కంది సాయిలు, అధ్యక్షుడిగా చెన్నా రాములు, ప్రధాన కార్యదర్శిగా కంది తిరుపతి, కోశాధికారిగా చెన్న రమేశ్, కంది సాగర్, ఉపాధ్యక్షుడిగా గజ్జెల రణధీర్, ప్రచార కార్యదర్శిగా సూత్రం ప్రమోద్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వద్లూరి కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కొత్వాల్ సతీశ్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ముత్యాల రాజయ్య ఎన్టీపీసీ పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘానికి ఒక గుంట భూమి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కంది చంద్రయ్య, అంజయ్య, కంది నాగరాజు, మల్లికార్జునస్వామితో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో పొలాలకు రోడ్ల నిర్మాణం



ఓదెల: ఓదెలలో ఉపాధి పనుల కింద పంట పొలాలకు రోడ్ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. గ్రామంలో 100మంది కూలీలు రైతులు పంటపొలాలకు వెళ్లేందుకు రోడ్డు వేశారు. వంద మంది వారం రోజుల నుంచి సుమారు 1.5కిలోమీటర్ దూరం వరకు రూ.6లక్షలతో రోడ్డు వేశారు. ఉపాధి పనులను ఓదెల ఎంపీడీవో జి.తిరుపతి, ఉపాధి ఆఫీసర్ శ్వేత, టీఏలు జనార్ధన్, నాయక్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు.